ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 14 జూన్ 2024 | 5

20వ తేదీ తర్వాత పిఠాపురంలో పర్యటిస్తా: మంత్రి పవన్‌కల్యాణ్

కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా
- 50 మంది వరకూ బాధితులు
- వివిధ ఆస్పత్రుల్లో చికిత్స
- గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు



సంతకాల.. సంబరాలు

- ఎన్నికల హామీలను నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు ఐదు తొలి సంతకాలు
- జిల్లాలో నిరుద్యోగులు, నిరుపేదలు, యువత, రైతుల్లో హర్షం
- డీఎస్సీ ఫైలుపై సంతకంతో జిల్లాలో 770కిపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- చెప్పినట్టుగానే సంతకం చేసి హామీ నెరవేర్చిన చంద్రబాబు
- అన్నక్యాంటీన్ల ఏర్పాటుతో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఇకపై పేదలకు కడుపు నిండా భోజనం
- పింఛన్ల పెంపుపై సంతకంతో వచ్చే నెల నుంచి జిల్లాలో 2.79లక్షల మందికి లబ్ధి
- నెలకు అదనంగా రూ.27.98కోట్ల చెల్లింపుల భారం
- భూహక్కు చట్టం రద్దు, పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ తొలగింపుతో ప్రజల భూములకు రక్ష
- స్కిల్ సెన్సెస్ ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి భీమా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు గురువారం సంతకాలు చేయడంతో జిల్లాలో అన్నివర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పై చేస్తానని చంద్రబాబు ఎన్నికలప్పుడు హామీ ఇవ్వగా దాన్ని సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే చేసి చూపించారు. అటు జగ్గంపేట ఎన్నికల సభలో ఓ నిరుద్యోగ యువతికి డీఎస్సీ ఫైలుపై సంతకం చేయాలంటూ పెన్ను కూడా బహుకరించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 770కిపైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుంది. అన్నా క్యాంటీన్ల ఏర్పాటుపై సంతకం చేయడంతో ఇకపై జిల్లాలో పేదలు కడుపునిండా రూ.5కే భోజనం చేయనున్నారు. త్వరలో అన్ని నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. పింఛన్ల పెంపుపై మూడో సంతకం నేపథ్యంలో జిల్లాలో 2.79లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన భూహక్కు చట్టంతో సామాన్యుల భూములకు రక్షణ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో దీన్ని రద్దు చేయడంతో ఇక ప్రతి వ్యక్తి భూమి భద్రంగా ఉండనుంది. యువతకు నచ్చిన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా స్కిల్ సెన్సెస్ పై మరో సంతకం చేయడంతో నిరుద్యోగుల్లో ఉపాధి ఆశలు చిగురించినట్లయింది.

వందల్లో ఉపాధ్యాయ పోస్టులు..

గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను జిల్లాలో నిలువునా ముంచేసింది. తనకు అధికారం ఇస్తే ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని నమ్మించిన జగన్ సీఎం అయ్యాక దాని ఊసే గాలికి వదిలేశారు. నిలువునా వారిని మోసం చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేస్తానని చంద్రబాబు ఎన్నికలప్పుడు హామీఇచ్చారు. దానికి తగ్గట్టుగానే చంద్రబాబు గురువారం సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం కింద డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తూ హామీని నెరవేర్చారు. దీంతో జిల్లాలో వేలాది నిరుద్యోగుల్లో ఆనందం మిన్నంటింది. ప్రధానంగా ఈ నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో 770 వరకు పోస్టులు భర్తీ కానున్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 570, ఎస్జీటీ పోస్టులు 200 వరకు నోటిఫికేషన్ రానుంది. వాస్తవానికి జిల్లాలో ఏళ్ల తరబడి ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి వైసీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రెండేళ్లు, ఆ తర్వాత వైసీపీ మరో రెండేళ్లు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచాయి. దీంతో నాలుగేళ్ల పెంపును పొందడంతో 2020లో ఉద్యోగ విరమణ చేయాల్సిన ఉపాధ్యాయులు ఈ ఏడాది పదవీ విరమణ చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో భారీగా ఖాళీలు ఏర్పడబోతున్నాయి. ఇందులో సెకెండరీ గ్రేడ్ పోస్టులు, వివిధ కేటగిరీలకు చెందిన స్కూల్ అసిస్టెంట్‌లు, 15 గెజిటెడ్ హెడ్మాస్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు వీటన్నింటికీ పోస్టుల భర్తీ జరగనుంది. వాస్తవానికి ఖాళీలు ఇంకా భారీగా ఉండాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల విలీనం విధానం తేవడంతో పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇప్పటివరకూ జిల్లాలో 151 ప్రాథమిక పాఠశాలలను సమీపంలోఉన్న 89 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేశారు. మిగిలిన ప్రాథమిక పాఠశాలలను కూడా విలీనం చేసేందుకు రంగం సిద్ధం చేశారు. సంబంధిత ఉన్నత పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తికాక తరగతిగదులు అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటివరకూ మిగిలిన వాటి జోలికి వెళ్లలేదు. అవి కూడా విలీనమైతే ప్రాథమిక పాఠశాలల్లో ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య ఇంకా తగ్గుతుంది. ఈ నేపథ్యంలో 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడితే మరిన్ని పోస్టులు పెరిగే అవకాశం ఉంటుంది.

పేదలకు పండగే..

జిల్లాలో నెలనెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర కళాకారులకు ఇస్తున్న పింఛన్ ఏమాత్రం సరిపోవడం లేదు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఇప్పుడు ఇస్తున్న డబ్బులు చాలక పేదలంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జూలై నుంచి నెలకు ఒక్కొక్కరికి రూ.4వేల పింఛన్ ఇస్తామని చంద్రబాబు హామీఇచ్చారు. ఈ నేపథ్యంలో దీన్ని నెరవేరుస్తూ గురువారం సంతకం చేశారు. దీంతో జిల్లాలో 2,79,805మంది పింఛన్‌దారులకు ఆర్థికంగా మేలు జరగబోతోంది. ప్రస్తుతం వీరందరికీ నెలకు రూ.82.89కోట్ల వరకు చెల్లిస్తున్నారు. ఇప్పుడు రూ.4వేల పెన్షన్ పెంపు నేపథ్యంలో అదనంగా నెలకు ప్రభుత్వం రూ.27.98కోట్లు అదనంగా చెల్లించనుంది. మరోపక్క దివ్యాంగులకు నెలకు ఇకపై రూ.6వేల వరకు పెన్షన్ అందనుంది. మరోపక్క గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలో ఐదు అన్నా క్యాంటీన్లు నిర్వహించేవారు. రూ.5కే పేదలు కడుపునిండా భోజనం చేసేవారు. వైసీపీ వచ్చాక వీటన్నింటిని మూసేసింది. తిరిగి వీటిని తెరిపిస్తూ చంద్రబాబు సంతకం చేశారు. పైగా ఇకపై జిల్లా కేంద్రంతోపాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోను కొత్తగా అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం తెరవనుంది. నాలుగో సంతకం కింద భూహక్కు చట్టంను రద్దు చేశారు. దీని పేరుతో గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో వేలాదిమంది పేదల సొంత భూములను చట్టం పేరుతో లాక్కునే ప్రయత్నం చేసింది. ఇది ప్రతిఒక్కరి భూమికి రక్షణ లేకుండా చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఇకపై ధీమాగా ఉండేలా ఈ చట్టాన్ని రద్దు చేశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ తొలగిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఐదో సంతకంగా స్కిల్ సెన్సెస్ విధానం అమల్లోకి తెస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఇందులోభాగంగా జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత వద్దకు అధికారులు వెళ్లి సర్వే చేపట్టనున్నారు. వీరికి ఉపాధి కింద ఏ పని చేయడం ఇష్టమో కనుక్కుని ఆ పనికి తగ్గ నైపుణ్య శిక్షణ నేర్పేలా సర్వే చేయనున్నారు. తద్వారా యువతకు వారికి తగ్గ నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి లభించేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

నిలిచిన సేవలు



- మీ-సేవ, సచివాలయాల్లో ఆగిన సర్వర్లు
- రాష్ట్రస్థాయిలో అప్‌డేట్ చేస్తున్న ప్రభుత్వం
- ఈనెల 15 వరకూ ఇంతే

సామర్లకోట, జూన్ 13: ప్రభుత్వం మారడంతో రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేస్తున్నారు. ఈ పరిణామంతో మీ-సేవ, సచివాలయాల్లో సేవలన్నీ నిలిచిపోయాయి. ఐదురోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. పునరుద్ధరించే అవకాశాలు ఈనెల 15వతేదీ తర్వాతే ఉన్నాయని జిల్లా అధికారులు వెల్లడిస్తున్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి ఎటువంటి ఫైళ్ల మార్పు చేయరాదంటూ ఆదేశాలు వచ్చాయి. రాష్ట్రస్థాయిలో ఐటీ సెల్‌లో అప్‌డేట్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు కావాల్సిన 1బీ, అడంగళ్ వంటి పత్రాలు అందడం లేదు. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో కూడా సర్వర్లు పనిచేయడం లేదు. ఒకటి, రెండు చోట్ల కాదు జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. రైతులు మీభూమి ద్వారా 1బీలు, అడంగళ్ పొంది తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ రుణాలు రెన్యూవల్, కొత్తరుణాలు పొందాలంటే చాలా బ్యాంకులు తహశీల్దార్ల డిజిటల్ సిగ్నేచర్‌తో కూడిన 1బీలు అడుగుతున్నారు. అవి తీసుకోవాలంటే సర్వర్లు పనిచేయడం లేదు. మీభూమి ద్వారా తీసుకుంటున్న 1బిలతో రుణాలను రెన్యూవల్ చేయాలని రైతులు కోరుతున్నారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలు కూడా రెండురోజులు గడువు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంటకాగిన అధికారుల్లో అలజడి

- ఐదేళ్ల అరాచకాలకు అధికారుల దన్ను
- వైసీపీ నేతలతో అంటకాగుతూ అక్రమాలు
- నేడు పోస్టుల కోసం పడిగాపులు

తునిరూరల్, జూన్ 13: ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం నేతలు సాగించిన అరాచకాలకు కొందరు అధికారులు దన్నుగా నిలిచారు. నాయకులు చెప్పిందే చెప్పమంటూ చెలరేగిపోయారు. ప్రతిపక్షాన్ని కాలు కూడా కదపకుండా చేశారు. అధికారపార్టీ ప్రజాప్రతినిధులు మెప్పుకోసం అత్యుత్సాహం ప్రదర్శించారు. కానీ ఓటర్లు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని కుక్కటవేళ్లతో సహా పెకెలించేశారు. ఇప్పటివరకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూటమికి భారీమెజార్టీతో విజయాన్ని కట్టబెట్టారు. ఈ అధికార మార్పిడితో యంత్రాంగంలో అలజడి నెలకొంది. కూటమి అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచినా కనీస గౌరవం ఇవ్వని అధికారులు ఇప్పుడు వారి నివాసాలు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లోను కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఫలితాలు వెలువడిన తర్వాతరోజు నుంచే విజేతలతోపాటు విజేతల అనుచరుల ఇంటి వద్ద రద్దీ పెరిగింది. పలు ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది అభ్యర్థుల గెలుపునకు అభినందన తెలుపుతూనే తమకు నియోజకవర్గాల్లోనే ఉన్నచోటనే విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

● తునిలో అధికారుల్లో కలవరం

తుని నియోజకవర్గ పట్టణ, మండలాల పరిధిలో మెప్మా, వెలుగు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందుల్లో ఆందోళన నెలకొంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో తుని వైసీపీ అభ్యర్థిగా జిల్లా మంత్రి పోటీలో నిలవడంతో తునిలో అధికార యంత్రాంగం, మెప్మా, వెలుగు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి వైసీపీ అభ్యర్థి గెలుపునకు అహర్నిశలు శ్రమించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీ అభ్యర్థి యనమల దివ్య నామినేషన్‌కు తరలివెళ్లే క్రమంలో ఉపాధి కూలీలు పాల్గొనకుండా ఉపాధి సిబ్బంది కట్టడి చేశారని అప్పట్లో టీడీపీ నేతలు ఆరోపించారు. అప్పటి మంత్రి దాడిశెట్టి రాజా నామినేషన్‌కు ఉపాధి కూలీలకు డబ్బులు పంచి మస్తర్లు వేస్తామని నామినేషన్‌కు తరలించారన్న ఆరోపణలున్నాయి. తుని నియోజకవర్గంలో పట్టణ పరిధిలో మెప్మా, మండల పరిధిలో వెలుగు అధికారులు అప్పటి మంత్రి వద్ద తాయిళాలు అందుకుని మహిళలతో గంపగుత్తుగా ఓట్లు వేయిస్తామని హామీ ఇచ్చినట్లు అప్పట్లో పెద్ద దుమారం రేగింది. తుని పట్టణ శివారు ఓ కల్యాణ మండపంలో వలంటీర్లకు విందు భోజనాలు ఏర్పాటు చేసి కోడ్ అమల్లో ఉన్నా అప్పటిమంత్రి దాడిశెట్టి రాజా స్వయంగా సెల్‌ఫోన్లు పంపిణీ చేపట్టారు. ఈ దృశ్యాలు బయటకు వెళ్లకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. టీడీపీ నేతలు దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులను ఎన్నికల అధికారులు వివరణ కోరడం అప్పట్లో సంచలనంగా మారింది. ఉద్దేశపూర్వంగా వైసీపీకి సహకరించి ప్రతిపక్షాన్ని, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులను ఉన్నచోటే ఉంచుతారా అనేది సర్వత్రా చర్చ జరుగుతోంది.

కాకినాడ నగరంలో కూలిన భారీవృక్షం

- మూడుగంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

కాకినాడ సిటీ, జూన్ 13: కాకినాడ నగరంలోని శ్రీబాలాత్రిపుర సుందరి గుడి సమీపంలో అన్న క్యాంటీన్ పక్కన భారీవృక్షం రోడ్డు మీద కూలింది. గురువారం తెల్లవారుజామున వీచిన గాలులకు ఈ వృక్షం భూమిలోంచి వేళ్లతో సహా కూలిపోయింది. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో మూడుగంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఈ వృక్షం కొమ్మలను కట్ చేయించి అక్కడినుంచి తరలించి రాకపోకలకు వీలు కల్పించారు.



కాకినాడ నగరంలోని బాలాత్రిపుర సుందరి గుడి సమీపంలో అన్న క్యాంటీన్ పక్కన రోడ్డు మీద కూలిన భారీ వృక్షం

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభతరం: డీఎంహెచ్‌వో



శిక్షణకు వచ్చిన వైద్య బృందంతో డీఎంహెచ్ఓ, జీజీహెచ్ సూపరింటెండెంట్ తదితరులు

జీజీహెచ్(కాకినాడ), జూన్ 13: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నూరుశాతం ఫలితాలతో వైద్య చికిత్స సులభతరం అవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. క్యాన్సర్‌కు సంబంధించి మొదటిదశలో చేయాల్సిన పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఈనెల 13 నుంచి వచ్చేనెల 13 వరకు నెల రోజులు పాటు వివిధ విభాగాల వైద్యులకు శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వైద్యులు, వైద్యాధికారులకు క్యాన్సర్ లక్షణాలు, అనుమానితులను గుర్తించడం, నియంత్రణకు చికిత్సను అందించడం, తదితర అంశాలపై శిక్షణ ద్వారా పూర్తి అవగాహన కల్పిస్తే బాధితులను ప్రాథమిక దశలో గుర్తించి పూర్తిస్థాయిలో వైద్య చికిత్సను అందించేందుకు దోహదపడుతుందన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 40మంది చొప్పున మూడురోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆ విధంగా ఆరు బ్యాచ్‌లకు ట్రైనింగ్ సెషన్స్ నిర్వహిస్తామన్నారు. ఏపీ వైద్యవిధాన పరిషత్ పరిధిలో పనిచేసే గైనకాలజీ, డెంటల్ వైద్యులకు, రేడియాలజీ, పెథాలజీ, అంకాలజీ తదితర విభాగాల వైద్యనిపుణులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్‌కు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఏఎన్ఎంలకు పూర్తి అవగాహన కల్పించి వారితో ఎన్సిడి సర్వేలో ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను ఏ విధంగా గుర్తించాలి, గుర్తించిన పేషెంట్లకు ఏ విధమైన చికిత్స తీసుకోవాలో ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ బి.దేవీమాధవి, నోడల్ ఆఫీసర్స్ డాక్టర్ ఎస్.రుక్మిణీదేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కన్నిడి రత్నకుమార్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఏపీడీ మియాలజిస్ట్ డాక్టర్ రవికుమార్, డబ్ల్యూహెచ్‌వో నుంచి డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలతో..

సత్ఫలితాలు



సూక్ష్మపోషకాలు తప్పనిసరిగా వినియోగించాల్సిన చౌడుబారిన పొలం

- పంట ఎదుగుదలకు దోహదం
- ఆశాజనంగా దిగుబడులు
- గతంలో నూరుశాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా
- గత వైసీపీ పాలనలో విస్మరణ
- రైతులపై అదనపు భారం

పిఠాపురం, జూన్ 13: పంట ఎదుగుదలలో సూక్ష్మపోషకాలదే కీలకపాత్ర. దిగుబడులు ఆశాజనకంగా లభించాలంటే ఇవి సమతుల్యంగా ఉండాలి. ఇన్ని మంచి ఫలితాలు అందించే వీటిని గతంలో ప్రభుత్వం ద్వారా నూరుశాతం సబ్సిడీపై రైతులకు అందించి వేయాలని ప్రోత్సహించేవారు. వైసీపీ పాలనలో వీటిని విస్మరించారు. వీటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి వేయలేక, అదనపు భారం భరించలేక వీటి వినియోగంపై రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పంట ఆరోగ్యంగా ఎదగడానికి, దిగుబడులు ఆశాజనంగా ఉండడానికి సూక్ష్మపోషకాలు దోహదం చేస్తాయి. ఈసూక్ష్మపోషకాలు(మైక్రోన్యూట్రియంట్స్) అయిన జింకు, ఇనుము, మాంగనీసు, రాగి, బోరాను, గంధకం వంటి వాటిని వినియోగించడం ద్వారా రైతులు మంచి ఫలితాలు సాధించే వీలు ఏర్పడుతుంది. సూక్ష్మపోషకాలు భూమిలో అవసరానికి సరిపడా లేకున్నా, సమతుల్యత లోపించినా పంట దిగుబడి తగ్గడంతోపాటు చీడపీడల సమస్య అధికమయ్యే ప్రమాదముంది. వరితో పాటు చెరకు, పత్తి, అపరాలు తదితర పంటల ఎదుగుదలలో సూక్ష్మపోషకాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. ఒకే సారి వరిపండించే భూముల్లో ప్రతీ మూడు పైర్లుకు ఒకసారి, రెండు పంటలు పండించే చోట రబీ సీజన్ ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. లోపం నివారణకు ఎకరాలకు 400గ్రాముల జింక్‌సల్ఫేట్‌ను 200లీటర్ల నీటిలో కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. జింకును భాస్వరం ఎరువులతో కలిపి వేయకూడదు.

బోరాన్ ధాతు ప్రాముఖ్యత

మొక్కల పూత దశలో సంపర్కం, ఫలధీకరణ, ఆకుల్లో తయారయ్యే ఆహారం మొక్కల్లోని అన్నిభాగాలకు చేరవేయడంలో కీలకపాత్ర వహిస్తుంది. సున్నంపాలు ఎక్కువగా ఉండే నేలల్లో బోరాన్ లోపం అధికంగా కనిపిస్తున్నది. ఈ లోపం ఉన్న చెట్లు ఆకులు ముడుచుకుపోయి చిన్నవిగా తయారవుతాయి. కాయదశలో కాయలు పగిలిపోతాయి. ఎకరానికి ఒక కిలో బోరాక్స్‌ను ఆఖరి దుక్కులో వేయాలి. బోరాన్ లోప నివారణకు ప్రతి మొక్కకు 100 గ్రాముల బోరాక్స్ లేదా బోరికామ్లాన్ని భూమిలో వేయాలి. 0.1-02శాతం బోరాక్స్ లేదా బోరికామ్లాన్ని చిరుగువచ్చినప్పుడు 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నీటిపారుదల కింద సాగు చేసే పంటకు ఎకరానికి 4కిలోల బోరాక్స్‌ను విత్తే సమయంలో వేయాలి.

చౌడు భూములు సరిచేయడంలో జిప్సం

చౌడుభూములను తిరిగి పంటల సాగుకు అనుకూలంగా చేయడంలో జిప్సం కీలకపాత్ర పోషిస్తుంది. జిప్సం ఎరువులో కాల్షియం, గంధకం ధాతువులు ఉంటాయి. చౌడుభూముల్లో ఉండే మార్పిడి చెందే సోడియంను తగ్గించి నేలను బాగు చేయడానికి జిప్సం ఎరువు అవసరం. కారుచౌడు నేలలను బాగుచేయడానికి వేసవి వర్షాల సమయంలో జిప్సంను వేసి కలియదున్నాలి. తర్వాత పొలంలో నీటిని నిలపాలి. భూసార పరీక్షాఫలితాలకు అనుగుణంగా జిప్సం ఎరువు మోతాదును వేయాలి. అవి లేకుంటే ఎకరానికి 1.2-16 టన్నులు జిప్సంను వేయవచ్చు. నూనె గింజల పంటలకు ఎకరాకు 200 కిలోల జిప్సంను చివరి దుక్కిలో వేయాలి. వేరుశెనగ పైరుకైతే పూత దశలో వేసి నేలలో కలపాలి. సోయాచిక్కుడు, కంది, పెసర, మినుము, శనగ వంటి పైర్లకు జిప్సం ఎరువును చివరి దుక్కులో ఎకరానికి 50-100 కిలోలు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

ఇతర సూక్ష్మపోషకాలు కీలకమే

ఇతర సూక్ష్మపోషకాల్లో కీలకమైన ఇనుముధాతు లోపనివారణకుగాను ఎకరానికి 20కిలోల అన్నభేది ఆఖరి దుక్కులో వేయాలి. పైరుపై ఇనుమ ధాతు లోపాలు కనిపిస్తే ఎకరానికి ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200లీటర్ల నీటిలో కలిపి వారంవ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి 10కిలోల మాంగనీసు సల్ఫేట్ ఆఖరి దుక్కులో వేయాలి. మొక్కలో విటమిన్ ఏ తయారికి దోహదం చేసే రాగి ధాతువు కోసం ఎకరానికి రెండు కిలోల కాపర్‌సల్ఫేట్‌ను 2-3 సంవత్సరాలకు ఒకసారి దుక్కులో వేయాలి.

నాడు ఉచితంగానే..

వరి సహా అన్నిరకాల పంటల సాగులో కీలకపాత్ర పోషించే సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, జిప్సంలను 2019వరకూ అప్పటి ప్రభుత్వాలు నూరుశాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు అందిచేవి. భూసార పరీక్షలకు అనుగుణంగా వీటిని రైతులకు సరఫరా చేశారు. ఉచితంగా అందించడానికి ముందు వీటిని 75-90శాతం సబ్సిడీతో అందించేవారు. వీటిని రైతులు తమ భూములకు వినియోగించుకుని సత్ఫలితాలు పొందేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. భూసారపరీక్షల నిర్వహణతోపాటు నూరుశాతం సబ్సిడీపై అందించే సూక్ష్మపోషకాల సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తే పడే భారాన్ని భరించే పరిస్థితి లేక సూక్ష్మ పోషకాల వినియోగాన్ని తగ్గించివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే భూసార పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో మాదిరిగా నూరుశాతం సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా

- 50 మంది వరకూ బాధితులు
- వివిధ ఆస్పత్రుల్లో చికిత్స
- గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు
- కలుషిత జలమే కారణమంటున్న గ్రామస్థులు



ఏపీ నగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

తొండంగి,జూన్ 14: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో డయేరియా ప్రబలింది. సుమారు 50 మంది వరకూ వ్యాధిబారిన పడి వాంతులు విరేచనాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వ్యాధి ప్రబలేందుకు కలుషిత తాగునీరే కారణమని పలువురు గ్రామస్తులు పేర్కొంటుండగా మరికొందరు నిల్వ ఉన్న రొయ్యల కూర తినడం ,మామిడి తాండ్ర తినడం వలన వ్యాధి వచ్చిందంటున్నారు. వ్యాధిబారిన పడిన వారిలో మహిళలు, చిన్నపిల్లలు ఎక్కువగా ఉండడంతో ఆందోళనకు గురైన కొందరు నేరుగా కాకినాడ, కత్తిపూడి, అచ్చంపేట, సీతయ్యపేట తదితర గ్రామాల్లో గల ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం తరలి వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటా సర్వే జరిపి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. తీవ్రమైన అస్వస్థతతో ఉన్న ఐదుగురిని ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జనరల్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. కొందరికి డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సరిత, డాక్టర్ రవికుమార్ గ్రామంలో పర్యటించారు. పరిస్థితి అదుపులోనే ఉందని ఎవరూ ఎటువంటి



గ్రామంలో పర్యటిస్తున్న వైద్య శాఖ ఉన్నతాధికారులు

ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని తెలిపారు. నీటి వనరులు క్లోరినేషన్ చేయించాలని, తాగునీటి పైపుల లీకేజీ ఉంటే పరిశీలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినాలని సూచించారు. గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉండగా ఓసీ, బీసీ కాలనీ వాసులు తాగునీరు తాగే ప్రాంతంలోనే వ్యాధి బాధితులు ఎక్కువగా ఉండడంతో నీటి కలుషితమే ప్రధాన కారణంగా ఉండవచ్చని అంటున్నారు,

20వ తేదీ తర్వాత పిఠాపురంలో పర్యటిస్తా: పవన్‌కల్యాణ్

పిఠాపురం, జూన్ 13: శాసనసభ సమావేశాలు, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుస్తానని రాష్ట్ర మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ నెల 20వ తేదీ తర్వాత పిఠాపురంలో తన పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మీడియాకు గురువారం మంగళగిరి నుంచి వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలో కార్యకర్తలను కలిసిన అనంతరం దశలవారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అన్ని వైపుల నుంచి శుభాకాంక్షలు, అభినందనలు అందుతూనే ఉన్నాయని చెప్పారు. ప్రజాజీవితంలో ఉన్న నాయకులు, మేధావులు, నిపుణులు, సినీరంగ ప్రముఖులు, యువత, రైతులు, ఉద్యోగవర్గాలు, మహిళలు అభినందనలు అందిస్తున్నారని చెప్పారు. జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు ఆనందంతో వేడుకలు చేసుకున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనను నేరుగా కలిసి అభినందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారని చెప్పారు. త్వరలో వారందరిని జిల్లాల వారీగా కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నానని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తానని తెలిపారు. అభినందనలు తెలియజేయడానికి వచ్చే వారు పూలబొకేలు, శాలువాలు తీసుకురావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోలవరం నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నంపై హెచ్‌ఆర్సీ స్పందన

చీఫ్ సెక్రటరీ, పునరావాస కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు

గోకవరం, జూన్ 13: తూర్పుగోదావరి జిల్లా గోకవరం శివారులోని పోలవరం నిర్వాసితుల కాలనీకి చెందిన ఉన్నమట్ల సీతారామయ్య అనే వృద్ధ నిర్వాసితుడు గత నెల 24వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఆంధ్రజ్యోతి ఇతర మీడియాలలో వచ్చిన కథనాల నేపథ్యంలో రంపచోడవరం న్యాయవాది ఎంవీఆర్ ప్రకాష్ సంబంధిత సంఘటనపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన కమిషన్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం పునరావాస కార్యక్రమాల అమలు, నిర్వాసితులకు చేసిన అన్యాయాలను మీడియా కథనాల ద్వారా పరిశీలించింది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి, పునరావాస కమిషనర్‌కు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు ఈనెల 11వ తేదీన నోటీసులు జారీ చేసి సంజాయిషీతో పాటు, సమగ్ర నివేదికను కోరింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దేవీపట్నం మండలంలోని సుమారు 36 గ్రామాలు భూములు, ఇళ్లు సర్వస్వం కోల్పోయి ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా రాజమహేంద్రవరం (ధవళేశ్వరం) కేంద్రంగా నడుస్తున్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఈ పునరావాస కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌తో పాటు అనుబంధ అధికారులు నిబంధనలు ప్రకారం పోలవరం నిర్వాసితుల భూములకు నష్ట పరిహారాన్ని, పునరావాస ప్యాకేజీని, పునరావాస కాలనీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో నిర్వాసితులు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా చంద్రబాబు పాలన అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పునరావాసాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పోలవరం కోసం త్యాగం చేసిన నిర్వాసితులు రోడ్డున పడ్డారు. ఈ పరిస్థితిని భరించలేని ఉన్నమట్ల సీతారామయ్య లాంటి నిర్వాసితులు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ తనకు అందిన ఫిర్యాదుపై తక్షణం స్పందించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పునరావాస కమిషనర్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదికల ఆధారంగా కమిషన్ తదుపరి చర్యలు తీసుకుంటుంది.



వాడపల్లి హుండీల ఆదాయం లెక్కింపు

ఆత్రేయపురం, జూన్ 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 28 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.77,65,489, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.19,32,588... మొత్తం రూ.96,98,077 ఆదాయం లభించింది. 33 గ్రాముల బంగారం, 580 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,53,803 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

గోపాలపురం. జూన్ 13: గోపాలపురం మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారులో అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి మణికంఠ చౌదరి(అయ్యప్ప) వయస్సు 31.. అప్పుల కారణంగా గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గురు వారం మధ్యాహ్నం కోడూరి వెంకటరమణకు చెందిన పొలంలో ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరపల్లి సీఐ కె.బాల సురేష్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వీఆర్‌వో పంచనామా అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. అయ్యప్పకు భార్య, ఏడాది పాప ఉన్నట్లు తెలిపారు.



యనమలను కలిసిన మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13: శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును విజయవాడలో గురువారం మంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సుభాష్‌ను యనమల అభినందించారు. మంత్రి సుభాష్ వెంట టీడీపీ నాయకులు గంధం పళ్లంరాజు, రాయపురెడ్డి సూరిబాబు, దొంగల శ్రీధర్ ఉన్నారు.

నిబంధనల మేరకు కొత్త అడ్మిషన్లు

విద్యాశాఖాధికారులతో ఐటీడీఏ పీవో వీడియో కాన్ఫరెన్స్

రంపచోడవరం, జూన్ 13: పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త అడ్మిషన్ చేసుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయ చాంబరులో విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థులకు వారి అర్హతలను బట్టి అడ్మిట్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని పీవో సూచించారు. ఎటువంటి తప్పులు జరగకుండా ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో మలేరియా దోమల మందును స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించాలన్నారు. పాఠశాలల్లో వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు అందంగా ఉండేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి డీడీ తేజస్విని, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కె.సుజాత, ప్రసాద్ పాల్గొన్నారు.

రావులపాడులో ఆయిల్ దుకాణం దగ్ధం

రూ.పది లక్షల ఆస్తి నష్టం





రావులపాలెం, జూన్ 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు పరిధిలో రహదారి చెంతనే ఉన్న ఒక మడ్డి ఆయిల్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కొత్తపేట అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రావులపాలానికి చెందిన నంబూరి రామమురళీమోహన్ రావులపాడు పరిధిలో మడ్డి ఆయిల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో మెకానిక్ షెడ్ల వద్ద నుంచి సేకరించిన పాత ఆయిల్‌ను నిల్వ ఉంచి విక్రయాలు సాగిస్తుంటారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్మేసి చీకటిగా మారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొత్తపేట, మండపేట అగ్నిమాపక శకటాలతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. టాటా ఏస్ వాహనం, పది టైర్ల పాత ట్యాంకరు, నిసాన్ కారుతో పాటు ప్లాస్టిక్ ఆయిల్ పీపాలు, షెడ్డు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

చెరువులో పడి అక్కాచెల్లెళ్లు మృతి

- అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో విషాదం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష



కావ్యశ్రీ



సాహితి

అడ్డతీగల జూన్ 13: అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో అక్కాచెల్లెళ్లు చెరువులో పడి మృతిచెందారు. ఆలస్యంగా ఆ విషయం వెలుగుచూసింది. సోమన్నపాలెం గ్రామానికి చెందిన వంతల కావ్యశ్రీ (13), సాహితి(10) కాలకృత్యాల కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు బుధవారం వెళ్లారు. ప్రమాదవశాత్తు సాహితీ చెరువులో పడిపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో సోదరి కావ్యశ్రీ కూడా చెరువులోకి జారిపోవడంతో ఇరువురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించారు.



ప్రాజెక్టు పత్రాలను అందుకుంటున్న విజయనిర్మల

గోదావరి క్లస్టర్ విశ్వవిద్యాలయానికి యాప్సీ ప్రాజెక్టు మంజూరు

దివాన్‌చెరువు, జూన్13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (యాప్సీ) గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్టు మంజూరు చేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌లలో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగ అధ్యాపకులు పి.విజయనిర్మలకు ప్రాజెక్టు పత్రాలను గురువారం వీసీ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులకు వివరాలు అందించారు. యాప్సీ గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి, డాక్టర్ వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయాలకు రూ.10 లక్షల ప్రాజెక్టు మంజూరు చేశారన్నారు. ఈ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లుగా నన్నయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు విజయనిర్మల, తాడేపల్లి గూడెంలోని ఎన్.ఐ.టి. జీవ సాంకేతిక విజ్ఞానశాస్త్రం అధ్యాపకుడు టి.జగన్మోహనరావు, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం జీవ రసాయనశాస్త్రం ఆచార్యులు డి.ఆర్.సలోమినునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

89వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న తాతీలు

కరప, జూన్ 13: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడమే గాక యువకులను ప్రోత్సహించి వారితో కూడా రక్తదానం చేయిస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారు కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి నారయ్య(తాతీలు). అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన 89వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. బిక్కవోలు మండలం బాలవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి అమ్ములు అనే మహిళకు అత్యవసరంగా బ్రెయిన్ సర్జరీ చేయాల్సి వచ్చింది. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు బ్లడ్ అవసరమని ఆమె బంధువుల ద్వారా తెలుసుకున్న తాతీలు వెంటనే ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న తాతీలును ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు బి.శ్రీహరిబాబు, జి.లక్ష్మి తదితరులు అభినందించారు.

40వ సారి రక్తదానం



కొత్తపల్లి, జూన్ 13: జాతీయ రక్తదాన దినోత్సవం (బ్లడ్ డోనర్స్ డే) శుక్రవారం కావడంతో 40వ సారి రక్తాన్ని దానం చేసేందుకు సిద్ధమయ్యారు కొత్తపల్లి మండలం కొత్తమూలపేట సెజ్ పునరావాస ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు అడపా వెంకటశ్రీనివాసరావు. రోడ్డు ప్రమాదాల్లో రక్తం కోల్పోయి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి వారికి రక్తాన్ని దానం చేయడం ద్వారా నిండు ప్రాణాన్ని కాపాడవచ్చునని ఆయన చెప్పారు. రక్తం దానం చేయడం ద్వారా శరీరంలో శక్తి కోల్పోతామన్నది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరూ సంవత్సరానికి ఒకటి లేక రెండు సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. గత సంవత్సరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 39వ సారి రక్తాన్ని దానం చేశానని, చెప్పారు.

మొక్కు తీర్చుకున్న చంద్రబాబు అభిమాని



చంద్రబాబు ఫొటోతో మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న సుబ్రహ్మణ్యం

కడియం, జూన్ 13: కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు సీఎం అయితే గౌరీపట్నంలో మేరీ మాత ఆలయానికి వచ్చి మోకాలిపై మెట్లు ఎక్కి మేరీ మాతను దర్శించుకుంటానని కడియం గ్రామానికి చెందిన జువ్వల సుబ్రహ్మణ్యం మొక్కుకున్నాడు. కోరిక నెరవేరడంతో చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజున మేరీ మాత ఆలయం వద్ద ఉన్న సుమారు 160 మెట్లను చంద్రబాబునాయుడు ఫొటో పట్టుకుని మోకాళ్లపై ఎక్కాడు. తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు. ఆర్టీసీ డ్రైవరుగా పని చేసే సుబ్రహ్మణ్యం రెండేళ్ల కిందట ఈ మొక్కు మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని అభినందించారు.

పీడీఎస్ బియ్యం సీజ్



బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

అమలాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడులోని ఖాళీ స్థలంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో గురువారం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం దాడులు నిర్వహించింది. 52 బస్తాల్లో 2645 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. సత్తి సతీష్ అనే వ్యక్తి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పరిసర ప్రాంతాల్లోని మోటారు సైకిలిస్టులనుంచి కిలో రూ.20కు కొనుగోలు చేసి అదే బియ్యాన్ని ఆలమూరు, జొన్నాడ పరిసరాల్లోని ఇటుక బట్టీల కార్మికులకు కిలో రూ.22కు విక్రయిస్తున్నాడు. సదరు బియ్యానికి ఎటువంటి బిల్లులు లేవు. దీంతో రూ.1,28,347 విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. సత్తి సతీష్‌పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్, లోవరాజు, కిశోర్, ఎస్కే. ఆలీషా పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 13: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన ముద్దాడ రవిచంద్రను ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు సెక్రటేరియట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం తరుపున సహకరించాలని ముద్దాడ రవిచంద్రను ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ, పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేఎన్‌వీ ప్రసాద్, జిల్లా ట్రెజరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్ కోరారు.

గోదావరిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించిన స్థానికులు

ఐ.పోలవరం, జూన్ 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల గోదావరిలో గురువారం కొట్టుకుపోతున్న వ్యక్తిని స్థానికులు రక్షించారు. గురువారం మురమళ్ల గోదావరి బ్రిడ్జిపై నుంచి ఒక వ్యక్తి నదిలో పడి కొట్టుకుపోతుండగా బొక్కా నరేష్ వేరొకరి సహాయంతో పడవ ద్వారా అతనిని రక్షించి ఒడ్డుకు చేర్చాడు. అతడి వివరాలు తెలియలేదు. అతడికి మతిస్థిమితం లేదు.



ప్రాణాలతో బయటపడిన వ్యక్తి

'కూలీల ఉపాధికి భరోసా కల్పించాలి'

కాకినాడ సిటీ, మే 13: గత ప్రభుత్వ విధానాలను రద్దు చేసి హమాలీ కూలీల ఉపాధికి భరోసా కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. సివిల్ సప్లయిస్ హమాలీ కూలీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడలోని సివిల్ సప్లయిస్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. యూనియన్ అధ్యక్షుడు తలాటం వీరబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సివిల్ సప్లయిస్ డీఎంకు అందజేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

పవన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



పవన్‌ను కలిసి అభినందిస్తున్న వర్మ

పిఠాపురం, జూన్ 13: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కలిశారు. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన గురువారం పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో వర్మపై దాడి జరిగిన సంఘటన గురించి పవన్ ఆరా తీశారు. ఇటువంటి దాడి సరికాదని విచారం వ్యక్తం చేయడంతో పాటు ఖండించినట్లు వర్మ తెలిపారు. దాడి సంఘటనపై పవన్‌కు పూర్తి వివరాలు అందించగా, దానిపై విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. అనంతరం నియోజకవర్గ విషయాలపై చర్చించారు. 45రోజుల పాటు నిర్వహించిన ప్రచార కార్యక్రమాలు, కేడర్ పనిచేసిన విధానం, గ్రామాలు, బూత్‌లు వారీగా వచ్చిన ఓట్లు, మెజార్టీ తదితర వివరాలను బుక్‌లెట్ రూపంలో పవన్‌కు వర్మ అందజేశారు. త్వరలోనే పిఠాపురంలో పవన్ పర్యటిస్తారని తెలిపారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

కాకినాడ సిటీ, మే 13: భారీ మెజారిటీతో కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా వనమాడి కొండబాబు విజయం సాధించడం, కూటమి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడంపట్ల టీడీపీ శ్రేణులు గురువారం 9వ డివిజన్ గొడారిగుంట సెంటర్‌లో వార్డు అధ్యక్షుడు వాసంశెట్టి చిట్టప్ప, లుతుకుర్తి మోహన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అతిథులుగా క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎంఏ తాజుద్దీన్, చింతలపూడి రవి, నాయకులు చొల్లంగి వీరబాబు, సీకోటి అప్పలకొండ, డివిజన్ నాయకులు నక్క అప్పన్న, తల్లిబోయిన రాముడు, కట్టా సూరిబాబు పాల్గొన్నారు. 25వ డివిజన్ దుర్గాదేవి వీధిలో డివిజన్ ఇన్‌చార్జి మేడిశెట్టి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చేశారు. కార్యక్రమంలో 24వ డివిజన్ ఇన్‌చార్జి పాలిక నాని, 25వ డివిజన్ నాయకులు గుర్రాల ఆదిబాబు, చెరుకూరి శ్రీనివాసచౌదరి, మేడిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

'పనులను సత్వరం పూర్తి చేయాలి'

సామర్లకోట, జూన్ 13: పట్టణంలో కాపు కల్యాణ మండపం, నీలమ్మ చెరువు, తాగునీటి పథకం వంటి పనులను సత్వరం పూర్తిచేయాలని సామర్లకోట కూటమి నాయకులు మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావును కోరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం కమిషనర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించి పట్టణంలో పలు సమస్యలపై సమీక్షించారు. నీలమ్మ చెరువు అభివృద్ధి పనులకు అయ్యే మొత్తాన్ని ప్రతిపాదనలు రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి సరఫరా మరింత మెరుగయ్యేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ కార్యాలయం వెనుక గల కాపు కల్యాణమండపం వాస్తవ స్థితిగతులను కూటమి నేతలతో పరిశీలించారు.

'రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన'

గొల్లప్రోలు రూరల్, జూన్ 13: రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన వచ్చిందని, ఏపీ ఇక అభివృద్ధి పథంలో పయనిస్తుందని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువదీరి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రిగా కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రమాణం చేసిన నేపథ్యంలో గొల్లప్రోలు మండలం చేబ్రోలు జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చంద్రబాబు, పవన్, మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తాటిపర్తిలో కేక్ కటింగ్, స్వీట్లు పంపిణీ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, చిట్టూరి సుబ్బారావు, గోకరకొండ నారాయణస్వామి, నామా రాజేష్, ఏనుగుపల్లి నల్లబాబు పాల్గొన్నారు.

మానవసేవయే మాధవసేవ : ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జూన్ 13: మానవసేవయే మాధవసేవ అన్న విషయాన్ని గుర్తించి మనకు ఉన్న దాంట్లో తోటివారికి సహాయపడాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురువారం ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, కైండ్‌నెస్ సొసైటీ ఆధ్వర్యంలో 18 విభాగాల్లో పనిచేస్తున్న 153మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, సరోజిని దంపతులు, కనకదుర్గ వల్లీ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ ఏఎస్ రత్నం పాల్గొన్నారు.

ఆక్వా అక్రమ సాగును నిరోధించాలని వినతి

కరప, జూన్ 13: కొరుపల్లిలో ఆక్వా అక్రమ సాగును నిరోధించాలని కోరుతూ పలువురు రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో సుమారు 60ఎకరాల్లో చేపలసాగుకు అనుమతులు తీసుకుని రొయ్యలసాగు చేపడుతున్నారని స్థానిక రైతులు దేవిశెట్టి సీతారామాంజనేయులు, తోట కృష్ణ, పాపారావు, దేవిశెట్టి కొండలరావు, కడియాల సత్యనారాయణ ఆరోపించారు. ఈ చెరువుల్లోని వ్యర్థ జలాలను రావువారి పంటకాలువలోకి వదిలేస్తున్నారని, దీనివల్ల వ్యవసాయభూములు సారం కోల్పోయి చౌడుబారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి వనరులు కూడా కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

'పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి'

కరప, జూన్ 13: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. పాతర్లగడ్డ, గొర్రిపూడి, వలసపాకల, సిరిపురం, జి.బావారం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు 3వారాల బకాయిలు ఉన్నాయని, ఎన్నికల కోడ్ ముగిసినా పనులు కల్పించడంలేదని, పనులు లేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పనులు కల్పించాలని కోరారు. సంఘ కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, మండల నాయకులు పి.కృష్ణ, చోడిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

'గ్రామ అభివృద్ధికి పాటుపడతాం'

తుని రూరల్, జూన్ 13: గ్రామ అభివృద్ధికి పాటుపడతామని తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు స్పష్టం చేశారు. గ్రామ టీడీపీ కూటమి నాయకులతో కలిసి గ్రామ సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. గ్రామంలోని సమస్యలు, గడిచిన కాలంలో పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది చొరవ తీసుకోవాలని గజ్జి కోరారు. కార్యక్రమంలో గజ్జి రాంబాబు, చిరంజీవిరాజు, కొల్లు సత్యనారాయణ, పేరూరి వెంకట కృష్ణ, పేరూరి గాంధీ, మర్రి వీరబాబు, గెట్ల శివ, కోనా కన్నారావు,పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, జూన్ 13: కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ అధిక విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ తీగలపై వేలాడుతున్న కొమ్మలను తొలగించేందుకు శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్లంరాజు వీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, రవీంద్రపురం, సుబ్బంపేట, ఉప్పాడ, అమీనబాద్, మూలపేట గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు ఉండదని, వినియోగదారులు సహరించాలని ఆయన కోరారు.

జగ్గంపేట: రాజపూడి సబ్‌స్టేషన్ 11కేవీ రాజపూడి ఫీడర్ నందు శుక్రవారం కొత్త లైనులు వేయుట, చెట్లు నరికివేత, మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రత్నాలరావు తెలిపారు. రాజపూడి సబ్‌స్టేషన్ పరిధిలో గల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొంగోడు వెంకన్న కల్యాణానికి రాట ముహూర్తం

కరప, జూన్ 13: కొంగోడులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 17న వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయకమిటీ పెద్దలు తెలిపారు. దీనిలో భాగంగా గురువారం ఆలయంలో పందిరిరాట ముహూర్తం చేసి, పసుపు కొట్టి, స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలగా అలంకరించారు. ఈ 5 రోజులు స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహిస్తామన్నారు. మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీ ఆట్ల గోవిందరాజులు, గ్రామపెద్దలు నక్కా గోవిందు, కోన వీరభద్రరావు, మేడిశెట్టి సత్తిరాజు, మేడిశెట్టి వీరభద్రవెంకటరావు, తోటకుర సుబ్బారావు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

తుని రూరల్, జూన్ 13: తునిలో విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిజీలు ధరలు, కంపెనీ సోర్సు ఆఫ్, సప్లై వివరాలను పరిశీలించారు. దాసరి బుల్లి వెంకటరాజు షాపులో రూ.11లక్షలు, సాయి దుర్గా రైతు డిపోలో రూ.80వేలు, శ్రీ నాగలక్ష్మి సీడ్స్‌లో రూ.1.50లు విలువ గల పత్తి, వరి విత్తనాలు సంబంధించి అవకతవకలు గమనించడంతో సంబంధిత విత్తనాలు అమ్మకాలు నిలుపుదల చేయాలని మండల వ్యవసాయాధికారి అశోక్ ఆదేశించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్ట్

కొత్తపల్లి, జూన్ 13: అమరవల్లికి చెందిన వివాహిత దగ్గర అదే గ్రామానికి చెందిన వ్యక్తి అప్పు తీసుకుని వేధిస్తున్న సంఘటనలో బోరా కనకదుర్గ ఆత్మహత్యకు పాల్పడ్డం విదితమే. ఈ కేసులో నిందితుడైన బోరా చినరమణారెడ్డిని కొత్తపల్లి ఎస్ఐ పీవీ స్వామినాయుడు గురువారం మూలపేటలో అరెస్ట్ చేసి కోర్టుకి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో నిందితున్ని అరెస్ట్ చేయాలని ఇటీవల గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

మోగిన బడిగంట!

» తెరుచుకున్న పాఠశాలలు
» మొదటిరోజు విద్యార్థుల హాజరుశాతం అంతంతమాత్రమే



కరప:యండమూరు ప్రాథమిక పాఠశాలలో బడిగంట కొడుతున్న ఎంఈవో కృష్ణవేణి, పిఠాపురంలో తొలిరోజు పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

పిఠాపురం, జూన్ 13: హుషారుగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కొందరు. వెళ్లనంటూ మారం చేసే వారు మరికొందరు. వీరిని పాఠశాలలకు తీసుకువెళ్లుతూ బిజీగా తల్లిదండ్రులు ఇది పాఠశాలలు తెరిచిన తొలిరోజు కనిపించిన దృశ్యాలు. విద్యార్థుల హాజరు మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. వేసవి సెలవులు అనంతరం 49రోజులు విరామం తర్వాత పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. విద్యార్థులు బడిబాట పట్టారు. సెలవులు ముగియడంతో తమ పిల్లలను తీసుకుని పాఠశాలల వద్ద దిగబెట్టడంలో తల్లిదండ్రులు బిజీగా మారారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణం, మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రవేటు విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. వేసవి సెలవులు అనంతరం తొలిరోజు విద్యార్థుల హాజరు అంతంతమాత్రంగానే ఉంది. సెలవుల్లో బంధువుల ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు ఇంకా తిరిగి రాకపోవడంతో అన్ని పాఠశాలల్లో తరగతులు అరకొర విద్యార్థులతోనే సాగాయి. విద్యార్థులు కొత్త తరగతి గదుల్లోకి వెళ్లడంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో పరిచయ కార్యక్రమాలు జరిగాయి.

కరప: విద్యాశాఖాధికారుల ఆదేశాలతో ఉపాధ్యాయులు పాఠశాలలను ముస్తాబుచేసి విద్యార్థులకు సాదర స్వాగతం పలికారు. బడిగంట మోగించి విద్యార్థులకు బెలూన్లు అందజేసి తరగతి గదులకు తోడ్కొని వచ్చారు. కరప మండలంలో ఒక గురుకుల పాఠశాల, తొమ్మిది జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక పాఠశాలలు ఉండగా వాటిలో 5,102మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. తొలిరోజు 50శాతం మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలకు హాజరైనట్టు తెలిసింది. కరప హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో ఉన్న స్టూడెంట్ కిట్లను వ్యాన్‌లపై ఆయా పాఠశాలలకు తరలించారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, ఇతర సిబ్బంది బడికి రాని పిల్లల ఇళ్లకు వెళ్లి కారణాలను తెలుసుకున్నారు.

సామర్లకోట: తొలిరోజు మండలంలో మొత్తం 74 ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 33 శాతం విద్యార్థులు మాత్రమే పాఠశాలలకు హాజరయ్యారు. పవర, పండ్రవాడ గ్రామాల పాఠశాలలను సందర్శించిన ఎంఈవో శివరామకృష్ణయ్య ఆయా పాఠశాలల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి, శుచి, నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రౌతులపూడి: మండలంలో పాఠశాలలకు విద్యార్థులు అంతంత మాత్రంగానే వచ్చారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందలేదు. గురువారం సాంబర్‌బాత్ లేదా నిమ్మకాయ పులిహోర టమాటా పచ్చడి ఉడికించిన గుడ్డు ఇవ్వాల్సి ఉండగా కేవలం సాంబర్‌బాత్ ఇచ్చారు. భోజనం సక్రమంగా అందించాలని తల్లిదండ్రులు కోరారు.

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి తదితర పాఠశాలలను ఎంఈవో వి.రాజబాబు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన అమలును పరిశీలించారు. మండల వ్యాప్తంగా 50 ప్రభుత్వ పాఠశాలలు, 24ప్రైవేట్ పాఠశాలలు ఈవిద్యా సంవత్సరం తొలిరోజు పని చేశాయన్నారు.

కొత్తపల్లి: మండలంలో విద్యార్థులు 60శాతం హాజరయ్యారు. మండలంలో వివిధ పాఠశాలలకు టెక్స్ట్‌బుక్స్, నోటుబుక్స్ 70శాతం వరకు పంపిణీ చేసినట్టు ఎంఈవో బి.వేణుగోపాల్ తెలిపారు.

జగ్గంపేట: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలంలో 17ప్రాథమిక, 3ఉన్నత పాఠశాలల్లో 46,510పుస్తకాలు అందించామనిఎంఈవో తెలిపారు.



గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు

ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం: చిక్కాల

కాకినాడ సిటీ, జూన్ 13: ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు చిక్కాల రామచంద్రరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి తీసుకున్న నిర్ణయంతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపినట్లయ్యిందన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేయడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లువెత్తుతున్నాయన్నారు. పెన్షన్లు రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం చేయడంతో అవ్వా, తాతలు తమ పెద్ద కొడుకుగా చంద్రబాబును దీవిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్లు తెరవడంపై నాలుగో సంతకం చేయడంతో అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేదల ఆకలి తీర్చినట్లయ్యిందన్నారు. నైపుణ్య గణనపై ఐదో సంతకం చేయడంతో నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చినట్లయ్యిందని చిక్కాల ధన్యావాదాలు తెలిపారు.

పింఛన్ల పెంపుపై హర్షం



కాకినాడలో వృద్ధులకు కేక్ తినిపిస్తున్న నాయకులు

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో ప్రకారం అవ్వా తాతల పెన్షన్ రూ.4వేలు పెంచుతూ సీఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల 12వ డివిజన్ స్వర్ణాంధ్ర కాలనీలో సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమానికి ఆధ్వర్యం వహించిన టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ కేక్ కట్ చేసి అవ్వా, తాతలకు తినిపించి స్వీట్లు పంచారు. మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, టీడీపీ నాయకులు కట్టా వీరబాబు, నిమ్మల అబ్బాయి, తుమ్మలకొండలరావు, జనసేన నాయకులు రమణారెడ్డి, దొర, సత్తిబాబు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: వృద్ధులకు పింఛన్‌ని రూ.3 నుంచి రూ. 4 వేలుకు పెంచుతూ సీఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు హర్షం వ్యక్తం చేశారు.

తాళ్లరేవు: సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా 5సంతకాలు చేసినందుకు టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడివెంకటరమణ అభినందనలు తెలిపారు.

'అన్ని యాప్‌ల్లో నమోదు తప్పనిసరి'

జీజీహెచ్(కాకినాడ), జూన్ 13: వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల వివరాలను అన్ని యాప్‌ల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అర్బన్ యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నాయక్ మాట్లాడుతూ ఆర్‌సీహెచ్ పోర్టల్‌లోని మాతా, శిశు నమోదును ఏడాది చంటిపిల్లలకు భూత్ టీకాలు, ఎంసీహెచ్ ఇండికేటర్స్‌ని సమీక్ష చేసి తక్కువ పనితీరు ఉన్న యూపీహెచ్‌సీ వైద్యులకు సలహాలు, సూచనలు చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కన్నిడి రత్నకుమార్, ఇంచార్జ్ డీపీఎంవో డాక్టర్ సురేఖ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డాక్టర్ ఎస్.భాస్కర్‌రావు, డాక్టర్ ఆర్.రమేష్, ఎస్‌వో విజయలక్ష్మి, డెమో ప్రసాద్‌రాజు ఉన్నారు.

'డస్ట్‌బిన్లను వినియోగించాలి'

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 13: ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా సమకూర్చిన డస్ట్‌బిన్లను తప్పనిసరిగా వినియోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ప్రజలకు సూచించారు. ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటికీ మూడేసి డస్ట్‌బిన్లను గతంలోనే అందజేశామని, తడి-పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా ఆయా డస్ట్‌బిన్లలో మాత్రమే వేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. నగరంలో జగన్నాథపురం, ఏటిమొగ సినిమారోడ్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి పర్యవేక్షించారు. పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణలో లోపాలను గుర్తించి అందుకు బాధ్యులైన శానిటరీ సెక్రటరీకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఎంహెచ్‌వోకు తెలిపారు. పలు మస్తరు కేంద్రాలను కమిషనర్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ దర్మాజీ, సచివాలయ శానిటరీ సెక్రటరీ ఉన్నారు.

పెద్దాపురంలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

పెద్దాపురం, జూన్ 13: గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తక్షణం అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జె.సీతారామారావు అధ్యక్షతన గురువారం నియోజకవర్గస్థాయి రెవెన్యూ, పీఆర్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాను నిత్యం ప్రజలతోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు పనిచేసే అధికారులు మాత్రమే కావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల తమకు అవసరం లేదని, అలాంటివారు నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు. పెద్దాపురం మున్సిపాల్టీకి సంబంధించి ముందుగా చంద్రబాబు శతాబ్ది పార్కు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే పెద్దాపురం - జగ్గంపేట ప్రధాన రహదారి పనులు ప్రారంభించాలన్నారు. గుర్రాల సెంటర్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుధ్య తదితర సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ అధికారుల తీరుపై రాజప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల కాలంలో సచివాలయాల నిర్మాణానికే పరిమితమయ్యారని, కనీసం గ్రామాల్లో రహదారుల నిర్మాణం పట్టించుకోలేదని డీఈ, ఏఈల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) పాలకుర్తి శ్రీనుబాబు, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, మేడిది శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు రాజప్ప అభినందన

సామర్లకోట, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అభినందించారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో చంద్రబాబును రాజప్ప కలిశారు.

రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న నెహ్రూ

జగ్గంపేట, జూన్ 13: ఎట్టి పరిస్థితుల్లోను రైతులకు సాగునీరందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధికారులను ఆదేశించారు. జగ్గంపేటలో నెహ్రూ క్యాంపు ఆఫీసు నందు ఎంపీ రాజేశ్వరరావు, కార్యనిర్వహక ఇంజనీరింగ్ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ డివిజన్ నెంబరు4 జగ్గంపేట డీఈఈ శ్రీనివాస్, సహాయ కార్యనిర్వాహక అధికారి జగదీష్, మోహన్‌రావు, రామ తులసిలతో రివ్యూ మీటింగ్ చేశారు. గత ఖరీఫ్ సీజన్లో రాజపూడి ప్రాంత రైతులు అపారనష్టం కలిగిందని ఆ పరిస్థితులు రాకుండా పుష్కర ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా ఉన్న తాళ్ళూరు, రాజపూడి లిఫ్టులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలన్నారు. పోతుల మోహన్‌రావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, బస్వా చినబాబు,దిడ్డిశ్రీను ఉన్నారు.

నెహ్రూకు సత్కారాలు

ఎమ్మెల్యే నెహ్రూ క్యాంపు ఆఫీస్ నందు ధవళేశ్వరం రిటైర్డ్ ఎస్ఈ ఎస్.కృష్ణారావు, ధవళేశ్వరం ఎస్ఈ జి.శ్రీనివాస్, బస్వా పెద్దబాబు ధవళేశ్వరం ఇరిగేషన్ అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్, జగ్గంపేట ఎస్ఈ ఏలేరుసెక్షన్ శేషగిరి, ఎంపీ రాజేశ్వరరావు తదితర అధికారులు నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డీఈవో పిల్లి రమేష్ నెహ్రూ, నవీన్‌ను కలిసి శుభాకాంక్షలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సీఈవో శ్రీ రామచంద్రమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జగ్గంపేట ఎంపీడీవో కె.వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భూముల అందజేతలో నిర్లక్ష్యం'

తాళ్లరేవు, జూన్ 13: కోరింగ సర్వేనెం.276లో 70ఎకరాల అసైన్డ్ భూములను లోకాయుక్త ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అందజేయడంలో స్థానిక రెవెన్యూ అధికారులు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ నిర్లక్ష్యం వహించారని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ ఆరోపించారు. గురువారం తాళ్లరేవు అంబేద్కర్ భవనం వద్ద ఆయన మాట్లాడుతూ అధికారులు తగిన చర్యలు తీసుకోకుంటే ఈనెల 27న అసైన్డ్ లబ్ధిదారులు తమ భూములను స్వాధీనం చేసుకుంటారని హెచ్చరించారు. సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పిట్లా వరప్రసాద్, మాజీసర్పంచ్ మట్టపర్తి శ్రీనివాసరావు, సిద్దన రామకృష్ణ, పోతురాజు ఆనందరావు, వెంటపల్లి వెంకటరమణ తదితరులున్నారు.

ప్రజాప్రతినిధులు కాకుండా బంధువులతో సమావేశం నిర్వహిస్తారా?

గొల్లప్రోలు రూరల్, జూన్ 13: ప్రజాప్రతినిధులు కాకుండా వారి కుమారులు, భర్తలు, ఇతర బంధువులు, సర్పంచ్‌లు కాకుండా ఉపసర్పంచ్‌లు సమావేశంలోకి వస్తుంటే ఏమి చేస్తున్నారు. ఇది మండలపరిషత్ సమావేశమేనా అని మాజీ ఎంపీపీ ఉలవకాయల సత్యనారాయణ అధికారులను నిలదీశారు. వారు స్పందించకపోవడంతో జనసేన నాయకులతో కలిసి ఆయన సమావేశానికి వచ్చి కూర్చొన్నారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన మండపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ప్రారంభం కాగానే ఉలవకాయల అనధికారిక వ్యక్తులు మీటింగ్‌లోకి వచ్చి కూర్చుంటే ఏమి చేస్తున్నారని ఎంపీడీవోను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తాము సమావేశంలో కూర్చొంటామని చెప్పి అక్కడే ఉండిపోయారు. జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు జరగక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటి వరకూ కొత్త పనులు చేపట్టలేదని ఏపీవో కొండలరావు తెలిపారు. త్వరలోనే అన్ని పనులు, కాలువ పనులు నిర్వహిస్తామని చెప్పారు. ఏకేమల్లవరం ఉపసర్పంచ్ అరిగెల మణిబాబు మాట్లాడుతూ చేబ్రోలు-మల్లవరం రహదారి అధ్వానంగా మారిందని, గతంలో తామే స్వంతంగా రిపేర్లు చేయించుకున్నామని చెప్పారు.

మంత్రి సుభాష్‌కు అభినందన



సుభాష్‌కి పూలబొకే అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాసంశెట్టి సుభాష్‌ను గురువారం అమరావతిలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి చంద్రబాబు మంత్రి వర్గంలో మంత్రి పదవి దక్కించుకున్న సుభాష్‌ని అభినందించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాతో పాటూ కాకినాడ జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అనంతరం విజయవాడలో ఉన్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన కోళ్ల రవి



ప్రత్తిపాడు/రౌతులపూడి, జూన్ 13: రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును ప్రత్తిపాడు నియోజకవర్గ వెలమ సంఘ అధ్యక్షుడు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కోళ్ల రవి కలిశారు. అమరావతిలో గురువారం కోళ్ల రవి కలిసి బొకే అందజేసి అభినందించారు.

మోహిత్‌కు సత్కారం

ఏలేశ్వరం, జూన్ 13: ఇటీవల ప్రగళ్లపాటి వెంకట సూర్య ధనరాజ్ సాయి మోహిత్ జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఆల్ ఇండియాలో 71వ ర్యాంక్, తెలంగాణ ఈఏపీ సెట్‌లో 41వ ర్యాంక్, ఏపీఈఏపీ సెట్‌లో 40వ ర్యాంక్ సాధించడంతో పట్టణంలోని గురువారం ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం, వనిత సంఘం, విశ్వహిందూ పరిషత్, వాసవీ ప్లాటినం కపుల్స్, రాజకీయ ప్రముఖులు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. తల్లిదండ్రులు ప్రగళ్లపాటి కామేష్, అనురాధను అభినందిచారు.

క్యాట్ పరీక్షలో హేమాంబిక ప్రతిభ

గండేపల్లి, జూన్ 13: సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌కు చెందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థిని గాడి హేమాంబిక 2021-24 బ్యాచ్ క్యాట్ పరీక్షలో 90.23 శాతం మార్కులు సాధించి ఐఐఎం తిరిచిలో సీట్ సాధించినట్టు డైరెక్టర్ డాక్టర్ నల్లమిల్లి సుగుణరెడ్డి తెలిపారు. హేమాంబికు ఆదిత్య ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ విజయ భార్గవి, ఎం.గోవర్ధనరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

కాకినాడ అర్బన్ ఎంఈవో మృతి



వాణీకుమారి (ఫైల్)

సామర్లకోట, జూన్ 13: కాకినాడ అర్బన్ ఎంఈవోగా పనిచేస్తున్న వాణీకుమారి తీవ్ర అస్వస్థతతో పనసపాడు మెడికవర్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. గతంలో ఏడాది పాటు సామర్లకోట ఎంఈవోగా పనిచేశారు. కాకినాడ బదిలీ అయినప్పటికీ అనారోగ్య కారణాలతో సెలవులో ఉండి చికిత్స పొందుతున్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చెందనున్నారు. ఇంకా సర్వీసు 17 రోజులు మిగిలిఉండగానే ఎంఈవో మృతి చెందడం పట్ల సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తీవ్ర సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

నడకుదురు (కరప), జూన్ 13: దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు గురువారం నడకుదురు జనావళి వృద్ధుల అనాధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు అన్నదానం చేసి దుస్తులు, నగదును అందజేశారు. అభాగ్యులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంటున్న మందపల్లి శ్యామ్ అభినందనీయుడన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఈవోలు కె.తిరుమలరవితేజ, సీహెచ్.వెంకటరమణమూర్తి, వడ్డాది సత్తిబాబు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో విశేష పూజలు

పిఠాపురం, జూన్ 13: పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్స్ దత్తసాయినగర్‌లో వేంచేసి ఉన్న అభయ ఆంజనేయస్వామి సమేత దత్త లక్ష్మిగణపతి స్వామి ఆలయంలో గురువారం విశేషపూజలు జరిగాయి. ఎన్‌డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ జనసేన నాయకుడు బోనం పరమేష్ ఆధ్వర్యంలో గణపతి హోమం, మహామృత్యుంజయహోమాలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పేరు మీద అర్చనలు, ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం జరిగాయి. పరమేష్, ఆలయ అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, నున్న వీరబాబు, నరహరశెట్టి శివరాం, వింజవరపు ప్రభాకరరావు, నందీశ్వరరావు, కానిక సుబ్బారావు, రమణ, రమేష్, విత్తనాల సతీష్ వెంకటరమణ ఉన్నారు.

ఎమ్మెల్యే దివ్యను కలిసిన అధికారులు



తుని రూరల్, జూన్ 13: తేటగుంటలో తుని ఎమ్మెల్యే యనమల దివ్య కార్యాలయంలో గురువారం పలువురు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాటాడుతూ శాఖల వారీగా సమావేశాలు నిర్వహిస్తానని, గ్రామాల్లో పర్యటించి ప్రజలను వ్యక్తిగతంగా కలుస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), ఇనుగంటి సత్యనారాయణ, దాడి రాజబాబు తదితరులున్నారు.